# కాలము - దూరము

"హితశ్రీ"

చేతిలో పుస్తకం విలాసంగా ఊగిస్తూ, కాలేజీ రోడ్డు మీదుగా షికారు వెడుతున్న మూర్తికి, యాభయి ఒకటో సంవత్సరం కేలెండర్లు అమ్ముతున్న కుర్రాణ్ణి చూడగానే ఓ ఆలోచన కలిగింది. వొచ్చే జనవరికి తనకి పాతికేళ్లు నిండుతాయి. ఈపాతికేళ్ళ కాలంలో ఏమీ తెలియని అజ్ఞాన స్థితినించి బయల్దేరి విజ్ఞాన పథం మీద ఎంత దూరం ప్రయాణించాడు! ఎం. ఏ. డిగ్రీ అలా ఉండగా, వివిధ విషయాలమీద ఎన్ని పుస్తకాలు చదివి ఎంత విజ్ఞానం సంపాదించాడు! మూర్తికి ఇంకో తమాషా ఆలోచన తట్టింది. విజ్ఞానపథంమీద తన పురోగమనం సగటున సాలుకి ఎన్ని మైళ్లు? ఈ ఆలోచన రాగానే మూర్తి తనలో తాను నవ్వుకున్నాడు. ఈ లెక్క ఎలా తేల్తుంది? మూర్తి మళ్లీ నవ్వుకున్నాడు. అయితే ఈ ఆలోచన మూర్తిని ఎక్కువ సేపు బాధపెట్టలేదు. కారణం ఎదురుగా వస్తున్న ఓ కాలేజీ అమ్మాయి. దిక్కులు చూస్తూ హంసనడకలు నడుస్తున్న ఆ అందమైనఅమ్మాయిని చూడగానే ఇంకా పెళ్ళికాని మూర్తి మరోప్రపంచానికి తర్లివెళ్ళాడు. ఆమెని సమీపిస్తుండగా మూర్తికి హఠాత్తుగా ఓ దుర్బుద్ధి పుట్టింది. రోడ్డుపక్క కాలిబాటమీద పరధ్యానంగా నడుస్తున్న ఆ అమ్మాయిని మూర్తి ఢీ కొన్నాడు. ఆమె అదిరిపడి తత్తర పాటుతో పడబోయే సమయానికి అతను తన చేతుల్లో ఆమెని పొదివి పట్టుకుని, వెకిలిగా నవ్వుతూ 'క్షమించండి' అన్నాడు. ఆమె కోపంతో అతని పట్టును విడిపించుకుని అతనివైపు రౌద్రంగా చూస్తూ 'స్కౌండ్రల్' అని తీక్షణంగా అని ముందుకుపోయింది. ఆ తిట్టు వినగానే మూర్తికి ఎక్కడలేని ఉక్రోషమూ, పౌరుషమూ కలిగాయి. వెనక్కి తిరిగి ఆమెవైపు పోయి, కయ్యానికి కాలు దువ్వబోయేసరికి, మూర్తి వీపుమీద బలమైన చెయ్యి పడి అతన్ని ముందుకు నెట్టింది. అతను తమాయించుకుని వెనక్కి తిరిగి చూసేసరికి ఓ కుర్రాడు సైకిలు రోడ్డుమీంచి లేవతీస్తూ 'పొరపాటు జరిగింది క్షమించండి' అన్నాడు, మూర్తివైపు చూస్తూ. చుట్టుపక్కల పోయే జనం తనవైపు చూస్తుండటం చూసి మూర్తికి అవమానం కలిగింది. అతను కోపంగా ఆ కుర్రాడివైపు చూస్తూ, 'కళ్లు నెత్తిమీద పెట్టుకున్నావా?' అన్నాడు. ఆ కుర్రాడు ఏమీ మాట్లాడలేదు. మూర్తికి కోపం మరీ ఎక్కువైంది. దీనికితోడు ఆ కాలేజీ అమ్మాయి చాల దూరం వెళ్ళిపోయింది. ఇహ ఆమెతో పోట్లాట పెట్టుకోవడానికి అంత వీలులేదు. తన కోపం అంతా ఆ కుర్రాడిమీద చూపిస్తూ "ఫూల్" అని తిట్టాడు. దీంతో ఆ కుర్రాడికి కాస్త పౌరుషం కలిగి "బెల్ కొట్టాను సార్, మీరు వినిపించుకోక పోతే నాదా తప్పు" అన్నాడు. మూర్తి ఫెడేలున ఆ కుర్రాడి దవడమీద ఒక్కటిచ్చుకున్నాడు. ఆ కుర్రాడు కళ్లలో నీళ్లు తిరిగినా, ఏమనుకున్నాడో, ఏమోగాని నోరెత్తక సైకిల్ మీదెక్కి ముందుకి సాగిపోయాడు. కోపం అణుచుకుని మూర్తి ముందుకుపోతూ, క్షణంకింద జరిగిన మధురానుభూతిని జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

పార్కు సమీపిస్తుండగా, స్నేహితుడు రామచంద్రరావు కనబడ్డాడు. అతను మూర్తిని సమీపిస్తూనే, 'ఏమోయ్, ఈ విశేషం తెలుసా? మన శర్మకి కథానికల పోటీలో మొదటి బహుమానం వొచ్చిందట. పొద్దున ఎడిటర్ దగ్గర్నుంచి వాడికి ఉత్తరం వొచ్చింది' అన్నాడు. మూర్తికి ఈ వార్త అశనిపాతంలా తోచింది. అందులో రామచంద్రరావు ఈ వార్త చెప్పే ధోరణి చూస్తే తనని గేలిచేస్తున్నట్టుగా ఉంది. హుఁ. అయితే, ఈ పోటీలో తను ఓడిపోయాడన్న మాట. శర్మకా మొదటిబహుమానం! వెధవ

రచనలూ వాడూ. 'ఇప్పుడు శర్మగనక ఎదురుగా ఉంటే వాడి ముక్కుమీద ఒక్కటి గుద్ది ఉందును.' అనుకున్నాడు. ఈభావం వొచ్చినందుకు మూర్తి ఏ మాత్రం పశ్చాత్తాప పడలేదు. తను పోటీకి కథ పంపినప్పటినించీ, మొదటి బహుమానం తనదేనని నిశ్చయించుకున్నాడతను. అకస్మాత్తుగా ఇలా జరిగేటప్పటికి మూర్తి ఆ దెబ్బకి తట్టుకోలేకపోయాడు. పోనీ ఈ శర్మకి గాక మరెవరికయినా వొచ్చి ఉండినట్టయితే మూర్తికి అంతకష్టంగా ఉండేదికాదు. స్థానిక రచయితలలో తనకెంత అప్రతిష్ఠ! రామచంద్రరావుతో "అలాగా!" అనేసి మూర్తి ముందుకుపోయి చేతిలోని పుస్తకం సైడుకాలవలోకి విసిరి కొట్టాడు, "వెధవ పుస్తకాలూ వీడూ!" అనుకుంటూ. మూర్తి చేతిలోది శర్మ రాసిన పుస్తకం.

మూర్తి పార్కులోకి వెడుతుండగా, అతని ముందుగా పోతున్న తోపుడుబండిలోని చిన్న పిల్లవాడు మూర్తిని చూసి పకాలున నవ్వాడు. అదిచూసి మూర్తికి కూడా నవ్వాలనిపించింది. అతనూ నవ్వాడు. ఆ కుర్రాడు మూర్తివైపు చూసి అకస్మాత్తుగాఏడవటం మొదలుపెట్టాడు. మూర్తికి ఇది అర్థంకాలేదు. ఆతను ఆశ్చర్యంతో ఆ తోపుడు బండి పక్కగా నడుస్తున్నాడు. ఆ బండి తోసే నౌకరు పిల్లవాడిని సముదాయిస్తూ "ఎందుకు బాబూ ఏడుపు?" అని అడిగాడు. ఆ పిల్లవాడు మూర్తివైపు చెయ్యిపెట్టి చూపిస్తూ మారాం చేస్తున్నాడు. నౌకరు మూర్తివైపు తిరిగి నవ్వుతూ, "చూశారా, అబ్బాయి మిమ్మల్ని ఇట్టే స్నేహం చేసుకున్నాడు. మీరు బండీ తోయాలని మారాం" అన్నాడు. మూర్తికి ముచ్చట వేసింది. "పాపం ఆ కుర్రాడికి ఇంగితజ్ఞానమేం తెలుసు? ఏది కోరవచ్చో, ఏది కోరకూడదో ఆపసివాడి కెలాతెలుస్తుంది" అని లోలోపల అనుకుంటూ నవ్వుముఖంతో తోపుడు బండీమీద చెయ్యి వేసి నెట్టటం మొదలుపెట్టాడు. ఆ పసిపిల్లవాడు ఏడుపు ఆపి మూర్తివైపు నవ్వుతూ చూస్తూ, కేరింతలు కొట్టసాగాడు.

మూర్తికి ఉన్నట్టుండి ఓ సందేహం వొచ్చింది. ఆ పసిపాపకి తనంటే ఎందుకంత ఆపేక్ష? తనలో ఏం ఆకర్షణ వాడు కనిపెట్టాడు? పాతికేళ్ళ తనకీ, ఇంకా రెండేళ్ళయినా నిండి ఉండని వాడికీ సామ్యం ఏమిటి? స్నేహం ఏమిటి? అయినా ఆ పసివాడికి ఊహ ఏంతెలుసు? ఏదో ఉద్రేకం మీద ప్రవర్తిస్తారు జ్ఞానంలేని పసివాళ్లు. లేకపోతే, ఎన్నడూ చూడని తనని వాడు బండీ తోయమనటమేమిటి? యుక్తాయుక్త విచక్షణ జ్ఞానం వాడికేం తెలుసు? ఈ జ్ఞానం లేని పసివాడు క్రమక్రమంగా పెద్దవాడై తనకి మల్లే పాతికేళ్ళవాడయినప్పుడు, తనకి మల్లేనే ఆలోచనలతో ఏవేవో భావాలతో బుర్ర పాడుచేసుకుంటాడు. మూర్తికి నవ్వొచ్చింది. కుర్రాడు ఉన్నట్టుండి మళ్ళీ ఏడ్చాడు. మూర్తి ప్రశ్నార్థకంగా వెంటవొస్తున్న నౌకరువైపు చూశాడు. నౌకరు నవ్వుతూ, "ఎత్తుకోవాలని కాబోలు మారాం చేస్తున్నాడు" అన్నాడు. అంటూనే ఆ పిల్లవాణ్ణి ఎత్తి మూర్తి చేతుల్లో పెట్టాడు. అయిష్టంగానే మూర్తి వాణ్ణి అందుకున్నాడు. "ఈ కుర్రాళ్ళ ఉద్రేకాలు చూస్తే నవ్వొస్తుంది" అనుకున్నాడు మూర్తి. "కోరిక అకస్మాత్తుగా కలగటం, అదినెరవేరాలని మారాం చెయ్యటమే తెలుసుగాని, ఆకోరిక యుక్తమో కాదో వాళ్ళకేం తెలుసు పాపం?" అనుకున్నాడు. ఈ ఆలోచన రాగానే మూర్తికి హఠాత్తుగా ఇంతకిముందు తనకి కలిగిన కోరికలు జ్ఞాపకం వచ్చాయి. వాటిని తను ఎలా ఎదుర్కొన్నాడు? అవి యుక్తమో, అయుక్తమో పరిశీలించాడా? ఆ అమ్మాయిని ఢీకొనే ముందు, ఆసైకిల్ కుర్రాడిని కొట్టేముందు, శర్మ పుస్తకం కాలవలో పారేసే ముందు, ఆ ఉద్రేకాలను తర్కించాడా? అయితే, పాతికేళ్ళ తనకీ, ఆ పసిపిల్లవాడికీ భేదం ఏమిటి? ఏవిధంగా తను అజ్ఞానంలేని పిల్లవాడికంటే అధికుడు? మూర్తికి ముచ్చెమటలు పోశాయి. విజ్ఞాన పథంమీద తను ఎంతదూరం ప్రయాణం చేశాడు? మూర్తి నిట్టూర్పు విడిచాడు. సగటున సాలుకి సున్నా మైళ్ళ వేగంతో తను పురోగమిస్తున్నాడా?